క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

దమ్మపేట: మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, అన్నపురెడ్డిపల్లి ఎంపీపీ సున్నం లలిత, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొడ్డాకుల రాజేశ్వరరావు, సర్పంచ్ సున్నం రాము, దమ్మపేట ఉప సర్పంచ్ యుగంధర్ అబ్దుల్ జిన్నా పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి నూతన అంబులెన్స్

కరకగూడెం: స్థానిక పీహెచ్‌సీకి సోమవారం అత్యాధునిక సాంకేతిక విధానం ఉన్న 108 వాహనం చేరుకుంది. ఇప్పటి వరకు నడిచిన కాలం చెల్లిన వాహనం స్థానంలో దీనిని రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. ఈ వాహనానికి జీపీఎస్‌ను అమర్చారు. దీనివల్ల బాధితులు అంబులెన్స్‌కు కాల్ చేసినప్పుడు అది ఎక్కడుంది, సంఘటనా స్థలానికి చేరుకోడానికి ఎంత సమయం పడుతుందో అంచనా వేయడానికి అవకాశం ఉంటుంది. తద్వారా మండలవాసులకు మునపటి కంటే వేగంగా వైద్యసేవలందించే వీలుంటుంది.

ఆర్ట్స్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సెయింట్ పాల్స్ పాఠశాల ఆవరణలో ఆర్ట్స్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను ఎంఈఓ సమ్మయ్య ప్రారంభించి 150 పైగా ప్రదర్శించబడిన విద్యా వైజ్ఞానిక అంశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలకు ఉన్న జాతీయ స్థాయి గత అనుభవాలను ప్రస్తావిస్తూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యను ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ అబ్రహాం, ప్రిన్సిపాల్ కె.మంజురి ఉపాధ్యాయులు పద్మ, శ్రీనివాస్, జయబాబు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

మణుగూరురూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు సభ్యులు బేతంచర్ల వెంకటేశ్వరరావు మనువరాలు వేద ఆద్యశ్రీ పుట్టిన రోజు సందర్భంగా సంతోష్‌నగర్‌లోని బాలవెలుగు ప్రత్యేక పాఠశాల విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. తొలుత విద్యార్థుల సమక్షంలో ఆద్యశ్రీ జన్మదిన కేక్‌ను కట్ చేయగా.. మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గాజుల పూర్ణచందర్ రావు, కార్యదర్శి మీరాహుస్సేన్, సభ్యులు గాజుల రమేష్, అడబాల నాగేశ్వరరావు, కృష్ణ ప్రసాద్, భాగం రమేష్, పృథ్వి, శ్రావణి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

అశ్వాపురం: విష జ్వరాలు విజృంభిస్తున్న దృష్ట్యా మండల పరిధిలోని చింతిర్యాల కాలనీలో సోమవారం వైద్యాధికారి సంకీర్తన ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి ఇంటింటి సర్వే, రాపిడ్ ఫీవర్ సర్వే, డ్రైడే కార్యక్రమాలు చేపట్టారు. ఆరోగ్య సిబ్బందిని నాలుగు బృందాలుగా చేసి 235 ఇళ్లను ప్రతి బృందానికి 60 కుటుంబాలను కేటాయించి గృహ సందర్శన చేశారు. జ్వరాలు ఉన్న వారికి 80 మందికి రక్త నమూనాలు సేకరించారు. ప్రతి ఇంటి ఆవరణలో నిల్వ ఉన్న నీరు ప్రదేశాలను గుర్తించి తొలగించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సంకీర్తన మాట్లాడుతూ.. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మణుగూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్, ఏఎంఓ గొంది వెంకటేశ్వర్లు, లింగ్యా నాయక్, అరుణ్‌బాబు, సీహెచ్ఓ కాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

అశ్వారావుపేటరూరల్: ముస్లిం మైనార్టీ ఆధ్వర్యంలో సోమవారం అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కళాశాల, వంద పడకల ఆస్పత్రి, డయాబెటిక్ సెంటర్, రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేయించడం పట్ల ముస్లిం మైనార్టీ సదర్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. శాలువా కప్పి సన్మానం చేశారు. సదర్ కమిటీ అధ్యక్షుడు ఎండి.ఆసీఫ్ అలి, ఎండి.ఉస్మాన్, అల్లాభక్ష్ (బాబా), యాఖుబ్ అలి, హుస్సేన్ పాల్గొన్నారు.

ఎరియర్స్ చెల్లించాలి

మణుగూరురూరల్: సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డ్ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు మణుగూరు ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల అధికారులకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాంగోపాల్ మాట్లాడుతూ.. వేజ్‌బోర్డ్ ఎరియర్స్ బకాయిలను చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మేకల ఈశ్వర్, పుల్లారావు, ఎస్.శ్రీనివాస్, నాగరాజు, రవికుమార్, శ్రీనివాసరావు, సాయి ప్రకాష్, కృష్ణమూర్తి, శివ, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల అందజేత

- ఎమ్మెల్యే పొదెం ఆధ్వర్యంలో 'కల్యాణలక్ష్మి'..
- బీసీ రుణాలు అందజేసిన ఎమ్మెల్యే మెచ్చా
- 'బిక్కసాని' నేతృత్వంలో బీమా చెక్కులు



భద్రాచలం: కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య



అశ్వారావుపేట: బీసీ రుణాల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: బీసీ కులవృత్తిదారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా ఉంటారని, ఆర్థికంగా బలోపేతం చేసేందుకే రుణాలను అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో సోమవారం ప్రభుత్వం బీసీ కులవృత్తి లబ్ధిదారులకు మంజూరు చేసిన చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 300 మంది బీసీ కులవృత్తిదారులు, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ రుణాలను బీసీలు సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీడీఓలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం: కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య సోమవారం పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన 52 మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 విలువ గల చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు బలుసు నాగ సతీష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బూర్గంపాడు: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ సభ్యులై ఉండి ఇటీవల మరణించిన రైతు కుటుంబాలకు సాధారణ బీమా చెక్కులను సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు అందజేశారు. బూర్గంపాడులోని పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం ఆయా కుటుంబ సభ్యులకు పీఏసీఎస్ నుంచి ఒక్కో కుటుంబానికి రూ.50 వేల బీమా చెక్కులను అందించారు. కార్యక్రమంలో సీఈఓ ప్రసాద్, కార్యదర్శులు ఉమర్, తిరుపతిరెడ్డి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' ఎంపికపై ఆర్డీఓ క్షేత్రస్థాయి పరిశీలన

బూర్గంపాడు: గృహలక్ష్మి పథకంలో అర్హులను ఎంపిక చేసేందుకు సోమవారం భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. నాగినేనిప్రోలు గ్రామపంచాయతీలో దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి ఆర్డీఓ వివరాలను సేకరించారు. ఈ నెల 20వ తేదీ వరకు గృహలక్ష్మి దరఖాస్తులపై విచారణ జరుగుతుందని ఆర్డీఓ మంగీలాల్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్‌రామ్, నాగినేనిప్రోలు సర్పంచ్ భూక్యా శ్రావణి,ఉపసర్పంచ్ యడమకంటి ఝాన్సీలక్ష్మి, ఆర్ఐలు ముత్తయ్య, నర్సింహారావు,పంచాయతీ కార్యదర్శి బాలయ్య తదితరులున్నారు.



బూర్గంపాడు: నాగినేనిప్రోలులో లబ్ధిదారుల ఎంపికను పరిశీలన చేస్తున్న ఆర్డీఓ మంగీలాల్

దరఖాస్తుల పరిశీలనపై అవగాహన

దుమ్ముగూడెం: గృహ లక్ష్మి పథకం దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనపై పంచాయతీ కార్యదర్శులకు ఆర్డీఓ మంగీలాల్ సోమవారం అవగాహన కల్పించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో దరఖాస్తుతో పాటు పెట్టిన సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలన చేయాలని ఆయన సూచించారు. ప్రతి ఇంటినీ పరిశీలించి ఎక్కడా పొరబాటు దొర్లకుండా విచారణ చేపట్టాలని సూచించారు. ముందుగా ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టి మొదటి సారి మండలానికి వచ్చిన ఆర్డీఓకు రెవెన్యూ అధికారులు అభినందనలు తెలియచేశారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా ప్రస్తుత ఆర్డీఓ మంగీలాల్ బాధ్యతలు నిర్వహించిన సంగతి తెలిసిందే. కార్యక్రమంలో డీటీ మనిధర్, ఎంపీడీఓ ముత్యాలరావు, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్ పర్యటన



వ్యూపాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) జి.వెంకటేశ్వరరెడ్డి సోమవారం ఏరియా ఇన్‌చార్జ్ జీఎం ఈసం కృష్ణయ్యతో కలిసి పర్యటించారు. పర్యటనలో భాగంగా ఓసీ-2, ఓసీ-4, మణుగూరు ఓసీ, కొండాపురం భూగర్భ గనులను సందర్శించి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం కేసీహెచ్‌పీని సందర్శించి వ్యాగన్ లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఉత్పత్తి, ఉత్పాదకతల లక్ష్యసాధనపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున క్వారీల్లో నీటిని బయటికి పంపించేందుకు సామర్థ్యం గల పంపులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌కేఓసీ పీఓ లక్ష్మీపతిగౌడ్, మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసచారి, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, డీజీఎం(కేసీహెచ్‌పీ) మధన్ నాయక్, అధికారులు రాంబాబు, డి.శ్రీనివాస్, బైరెడ్డి వెంకటేశ్వరరెడ్డి సీనియర్ సెక్యూరిటీ అధికారి అబ్దుల్ షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నిధులిచ్చినా నీరందలే!

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు నిర్మించి, విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. నెలలు గడుస్తున్నప్పటికీ సమస్యను పరిష్కరించకపోవడంతో సోమవారం గ్రామస్తులు బోరు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తాగునీటి సమస్య పరిష్కారానికి తన కోటా కింద రూ.3.5లక్షల రూపాయాలు కేటాయించారు. ఈ నిధులతో ఓ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు హడాహుడిగా బోరు వేయించి, పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేయించాడు. ఈ పనులకే నిధులు సరిపోవడంతో బోరుకు విద్యుత్ మోటారును ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దాంతో లక్షలాది రూపాయాల నిధులు కేటాయించినప్పటికీ తాగు నీటి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఈ పనులను పర్యవేక్షించాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

లోపాలను సరిచేయాలి

అశ్వారావుపేటరూరల్: ధరణి వెబ్‌సైట్‌లో లోపాలను తక్షణమే సరిచేయాని సీపీఎం రాష్ట్ర కమిటీ నాయకుడు కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ధరణిలో సాంకేతిక కారణాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రాయితీ పథకాలు అందడం లేదన్నారు. తగరం జగన్నాథం, గడ్డం సత్యనారాయణ, కలపాల భద్రం, గడ్డం వెంకటేశ్వరరావు, సీసం రాముడు పాల్గొన్నారు.

పునర్వసు కల్యాణం

దుమ్ముగూడెం: పర్ణశాల సీతారామచంద్రస్వామి దేవాలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా సోమవారం కన్నుల పండువగా మాస కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు శేషం కిరణ్‌కుమార్‌చార్యులు, భార్గవాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ క్రతువు చేపట్టారు.

16, 17 తేదీల్లో నీటి సరఫరా బంద్

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెంలో రథంగుట్ట వద్ద వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంటులో పైప్‌లైన్, ప్లాంటులో మరమ్మతు పనుల కారణంగా రేపు, ఎల్లుండి రెండు రోజుల పాటు మిషన్‌భగీరథ నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మిషన్‌భగీరథ డీఈ మహేందర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు పినపాక నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాదని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఈ నెల 18న మరలా నీటి సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

చర్యలు తప్పవు

అశ్వాపురం: గ్రామీణ వైద్యులు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, పరిమితికి మించి వైద్యం చేసినా, అబార్షన్‌లు చేసినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని మండల వైద్యాధికారి డాక్టర్ సంకీర్తన హెచ్చరించారు. అశ్వాపురం పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం మండల గ్రామీణ వైద్యులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్లూకోజ్ బాటిల్స్ ఎక్కించడం, రక్త పరీక్షలు చేయడం వంటివి మానుకోవాలని, జ్వర బాధితులకు ఎటువంటి చికిత్సా చేయకుండా వెంటనే పీహెచ్‌సీకి పంపించాలని సూచించారు. రోగుల వివరాలు, అన్ని రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ఉద్యోగ సంఘం అధ్యక్షుడికి సన్మానం

అశ్వాపురం: ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన కూరపాటి శ్రీనివాసరావును గౌతమీనగర్ కాలనీలో సోమవారం మండల కేంద్రానికి చెందిన శివకామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో భారజల కర్మాగారం ఉద్యోగి జీఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఫ్లాగ్ మార్చ్



భద్రాచలం పట్టణంలో సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లు

భద్రాచలంఅర్బన్: స్వాతంత్య్ర మహోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగ ప్రచారంలో భాగంగా సీఆర్పీఎఫ్ 141 బెటాలియన్ తెలంగాణాలోని భద్రాచలం వద్ద సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, కమాండెంట్ 141 బెటాలియన్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, జవాన్లు వారి కుటుంబ సభ్యులు భద్రాచలంలో త్రివర్ణ పతాకంతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రతి పౌరుడి హృదయంలో దేశభక్తి భావాన్ని పెంపొందించడానికి, జాతీయ జెండాపై అవగాహన పెంచడానికి గ్రామాలు, పట్టణాలలో 141 బీఎన్, సీఆర్పీఎఫ్ కింద ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు 141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ దర్ తెలిపారు. వేడుకల్లో 141 బెటాలియన్ సెకండ్ కమాండెంట్లు కమల్‌వీర్ యాదవ్, ప్రీతి, సింగర్ వీల్, డిప్యూటీ కమాండెంట్ కల్పన, సీనియర్ మెడికల్ అధికారి హేమంత్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వ్యతిరేకంగా తీర్మానం

గుండాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా వ్యవహరిస్తున్న ఎంపీడీఓ తమకు వద్దని, సరెండర్ చేయాలని ఎంపీటీసీలు తీర్మానం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ముక్తి సత్యం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులతో సమీక్ష చేపట్టగా.. వారు అభివృద్ధి నివేదికలను వివరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటనష్టం, పరిహారం, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు చర్చించారు. అనంతరం ఎంపీపీ ముక్తి సత్యం, పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. గతంలో ట్రాక్టర్ రుణాలు, ప్రస్తుతం గృహలక్ష్మి, దళిత బంధు దరఖాస్తులకు సంబంధించి ఎంపీడీఓ తమకు ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదని, బీసీ రుణాలకు సంబంధించి కూడా అదే పునరావృతం అయిందని అన్నారు. ఈ క్రమంలో తాము ప్రజలకు ఏం చెప్పాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎంపీడీఓ తమకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, ఎంపీటీసీలు కృష్ణారావు, రాజేశ్వరి, పద్మ, సర్పంచ్‌లు సీతారాములు, సుధాకర్, డీటీ రజిని, పీఆర్ ఏఈ అఖిల్, హెచ్ఎం కిషన్, తదితరులు పాల్గొన్నారు.

తూరుబాక గ్రామంలో వైద్యశిబిరం

గుండాల: మండలంలోని తూరుబాక గ్రామంలో జ్వరాలు విజృంభిస్తున్న క్రమంలో సోమవారం వైద్యసిబ్బంది వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేసి మందులు అందించారు. రక్త టీ హబ్ కోసం రక్త నమూనాలను సేకరించారు. ఇంటింటి సర్వే నిర్వహించి ఇండ్లలోని నీటి నిల్వలను పరిశీలించారు. దోమ లార్వాలకు అవకాశం ఉన్నచోట శుభ్రం చేసుకోవాలని వైద్యాధికారి మనేష్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీహరి, ఎంటీఎస్ సత్యం, ఎల్‌టి రమేష్, ఏఎన్ఎంలు భువనేశ్వరి, అనసూర్య, హెల్త్ అసిస్టెంట్ రాఘవులు, ఎంఎల్‌హెచ్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఇప్పలగుంపులో..

మణుగూరురూరల్: మండల పరిధిలోని మారుమూల ఆదివాసీ గిరిజన ఇప్పలగుంపులో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ దుర్గా నరేష్ గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పలు సూచనలు చేశారు. అనంతరం నీటి నిల్వ ప్రాంతాల్లో యాంటీలార్వా చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పారాణి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, పద్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి



అశ్వాపురం: వైద్యాధికారి సంకీర్తనకు సమ్మె నోటీస్ అందజేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

దుమ్ముగూడెం: రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలను బేషరతుగా అనుభవం ప్రకారం రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ నాయకుడు నోముల రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ మణిధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా తమ డిమాండ్లను వినిపిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, దీంతో ఈ నెల 16 నుంచి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తాటిపూడి రమేష్, ఏఎన్ఎంలు వీరభద్రమ్మ, సమ్మక్క, పూర్ణ, భూదేవి, నరసమ్మ, తిరుపతమ్మ, గంగమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: సెకండ్ ఏఎన్‌ఎంలను ఎటువంటి రాత పరీక్షా లేకుండా బేషరతుగా రెగ్యులర్ చేయాలని కోరుతూ భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు సోమవారం రెండో ఏఎన్‌ఎంలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు వేల్పుల మల్లికార్జున్, బల్ల సాయికుమార్, నోముల రామిరెడ్డి, రెండవలు ఏఎన్‌ఎంలు సారిక, బాలనాగమ్మ, రాజమ్మ, వీరభద్రమ్మ, శ్యామల, అనిత, సుజాత, తిరుపతమ్మ పాల్గొన్నారు.

వైద్యాధికారి, డీటీకి సమ్మె నోటీస్

అశ్వాపురం: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు సోమవారం పీహెచ్‌సీలో వైద్యాధికారి సంకీర్తన, డిప్యూటీ తహసీల్దార్ ప్రతాప్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు రాయపూడి రాజేష్, సెకండ్ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

జెండా ఎగురవేసి ఐక్యత చాటాలి

అశ్వాపురం: ప్రతి ఒక్కరూ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జాతి ఐకత్యను చాటి చెప్పాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఐకార్ మెంబర్ ముస్కు శ్రీనివాసరెడ్డి అన్నారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని మొండికుంట, మల్లెలమడుగు, అశ్వాపురం, కొమ్ముగూడెం, వెంకటాపురం, రామచంద్రాపురం, నెల్లిపాకబంజర గ్రామాల్లో ప్రజలకు జాతీయ జెండాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాటిపాముల అయిలయ్య, ప్రధాన కార్యదర్శి సారయ్య, జిల్లా కార్యదర్శి బత్తుల రామకృష్ణ, జిల్లా నాయకుడు భూక్యా తార ప్రసాద్, నాయకులు కోలా భాస్కర్, బండ్ల నాగేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, కొల్లు లింగారెడ్డి, గోసుల రాములు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: ప్రధాని నరేంద్రమోదీ ఆదేశానుసారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సారపాకలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ జాతీయజెండాలను అందించారు. జాతీయ జెండా ఔన్నత్యాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భూక్యా ప్రసాద్, నరికుల్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



భద్రాచలంటౌన్: బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కుంజా సత్యవతి

భద్రాచలంటౌన్: భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన హర్‌ఘర్ తిరంగా ఉద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి అన్నారు. భద్రాచలం పట్టణంలోని బీజేపీ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవం వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన బైక్ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రామోహన్‌రావు, సత్యనారాయణ, నరసింహారావు, శ్రీనివాస్, వెంకటసుబ్బయ్య, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పశువుల తరలింపు.. పట్టివేత

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద టౌన్ ఎస్సై పీవీఎన్ రావు సోమవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా 4 పశువులను టాటా మ్యాజిక్‌లో చింతూరు నుంచి సారపాక వైపు.. 54 పశువులను లారీలో ఒరిస్సాలోని నాగోల్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన 58 పశువులను పోలీసులు పాల్వంచలోని గోశాలకు తరలించారు. ఈ క్రమంలో మొత్తం ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిషేధిత మందు..

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెం గ్రామంలోని రైతులకు నిషేధిత గ్లైఫోసెట్ మందును విక్రయిస్తుండగా మండల వ్యవసాయాధికారి నవీన్ కుమార్, ఏఈఓలు బాలాజీ, ప్రవీణ్‌లు సోమవారం పట్టుకున్నారు. గ్రామంలోని కొంతమంది రైతులకు గార్ల మండలం పాతపోచారం గ్రామానికి చెందిన రేఖం రామకృష్ణ, బొందిలి నాగరాజులు నిషేధిత మందును విక్రయిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 35 లీటర్ల నిషేధిత మందును స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో వ్యవసాయాధికారి ఫిర్యాదు చేయగా ఎస్సై కేశవరావు కేసు నమోదు చేశారు.

ఎనమిది క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

భద్రాచలంఅర్బన్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని సోమవారం పట్టణంలోని ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ ఎస్సై విజయలక్ష్మి తెలిపారు. సారపాక నుంచి భద్రాచలం వస్తున్న టాటా మ్యాజిక్ వాహనాన్ని తనిఖీ చేయగా ఎనమిది క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండడంతో డ్రైవర్ రవిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట రాయుళ్లపై కేసు నమోదు

దమ్మపేట: మండల పరిధిలోని గుర్వాయిగూడెం గ్రామ శివారులోని పామాయిల్ వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం గుర్వాయిగూడెం గ్రామ శివారులోని పామాయిల్ వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై రవికుమార్ సంఘటన స్థలంలో దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.11,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఆర్థిక సాయం అందజేత

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబానికి సోమవారం ఆర్థిక సాయం అందించారు. మండలంలోని దబ్బతోగు గ్రామానికి చెందిన పాయం మనోజ్(35) అనే వ్యక్తి ఇటివలే జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. బాధిత కుటుంబీకులకు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డేగల రామచంద్రరావు ఆధ్వర్యంలో రూ.5వేల నగదును అందజేశారు. మల్లం రామకృష్ణ, అడ్డూరి అనిల్, రాజేష్ పాల్గొన్నారు.